జన వాక్కు

ముస్లింలకు అండగా ఉంటానన్న చంద్రబాబు ముసుగు తొలగించాడు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లుకు ఏకపక్షంగా మద్దతివ్వడంతో బాబు నిజస్వరూపం బట్టబయలైంది. మాటలు నీటిపై రాతలేనని పార్లమెంట్ సాక్షిగా రుజువైంది. పదేళ్లుగా లౌకిక రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న బీజేపీతో జత కూడినప్పుడే బాబు తీరుపై ముస్లింలలో అనుమానం కలిగింది. తాజా వక్ఫ్ సవరణ బిల్లుకు ఆమోదం తెలపడంతో ఆ అనుమానం నిజమైంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముస్లింలకు మద్దతుగా పార్లమెంటులో సవరణ బిల్లును వ్యతిరేకించడం హర్షణీయం.

వక్ఫ్ బోర్డుతో ప్రభుత్వానికి సంబంధం లేదు



వక్ఫ్ బోర్డు కేవలం ముస్లింల ఆస్తుల రక్షణకు ఏర్పాటు చేసినది మాత్రమే. ఈ బోర్డుకు ప్రభుత్వానికి సంబంధ లేదు. 1957 కంటే ముందు మహ్మదియా మాస్క్ కమిటీ అనేది ఉండేది. ఈ కమిటీ బ్రిటీష్ హయాం నుంచి ఉండేది. వక్ఫ్ బోర్డు అటానమస్ బాడీ. ముస్లిం దేశాల్లో ఈ బోర్డును ప్రభుత్వాలే నిర్వహిస్తారు. కానీ భారతదేశం ప్రజాస్వామ్య దేశం కాబట్టి 1957లో అప్పటి కేంద్ర ప్రభుత్వం ముస్లిం ఆస్తులను ముస్లింలే రక్షించుకోవాలని ఏర్పాటు చేసిందే ఈ వక్ఫ్ బోర్డు.

–సయ్యద్ నాసీర్ హుసేని, ప్రభుత్వ ఖాజీ, కమలాపురం.

వక్ఫ్‌బోర్డు బిల్లును యథావిధిగా కొనసాగించాలి



పార్లమెంట్‌లో బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్‌బోర్డు బిల్లును వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించడం హర్షణీయమన్నారు. వక్ఫ్‌బోర్డు ఆస్తులపై బీజేపీ ప్రభుత్వం పెత్తనం చెలాయించాలని తీసుకున్న నిర్ణయం సరైనది కాదన్నారు. ఈ చట్టసవరణ బిల్లుకు టీడీపీ మద్దతు ఇచ్చి ముస్లింల మనోభావాలను దెబ్బతినేలా చూస్తోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముస్లింలకు మద్దతుగా పార్లమెంటులో సవరణ బిల్లును వ్యతిరేకించడం హర్షణీయం

– రసూల్, నూరుబాషా, కార్పొరేషన్ మాజీ చైర్మన్, పులివెందుల.

వక్ఫ్ బిల్లు రాజ్యాంగ విరుద్ధం



పార్లమెంటులో ప్రవేశపెట్టిన వక్ఫ్ బిల్లు(సవరణ)ను వెంటనే ఉపసంహరించాలి. వక్ఫ్ చట్టంలో సవరణల చేసి ప్రవేశపెట్టిన బిల్లు రాజ్యాంగ విరుద్ధం. వక్ఫ్ ఆస్తుల రక్షణకు ఈ బిల్లు భంగం కలిగిస్తుంది. వక్ఫ్ ఆస్తులపై ఇతరుల ఆధిపత్యంతో పాటు వక్ఫ్ ఆస్తులపై ముస్లింలు హక్కు కోల్పోయే ప్రమాదం వుంది. ముస్లిం వర్గం ఈ బిల్లును వ్యతిరేకిస్తోంది. బిల్లును తక్షణమే వెనక్కు తీసుకోవాలి.

–ఎస్.కదిర్ బాషా, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు, ముద్దనూరు.

వక్ఫ్‌బోర్డు బిల్లును వ్యతిరేకించడం హర్షణీయం



పార్లమెంట్‌లో బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్‌బోర్డు బిల్లును వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించడం హర్షణీయం. వక్ఫ్‌బోర్డు నిర్ణయాలు గతంలో ఎలా ఉన్నాయో అలాగే కొనసాగించాలి. ఈ చట్ట సవరణ బిల్లుకు టీడీపీ మద్దతు ఇచ్చి ముస్లింల మనోభావాలను దెబ్బతినేలా చూస్తోంది. ఈ చట్ట సవరణ బిల్లుపై బీజేపీ ప్రభుత్వం ముందుకు వెళ్తే నిరసన తెలుపుతాం. వక్ఫ్‌బోర్డు ఆస్తులను లాక్కునేందుకే చట్టసవరణ బిల్లును తీసుకొస్తున్నారు.

–వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ గౌస్‌పీరా, వేముల

ముస్లింలకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది



వక్ఫ్ బోర్డు చట్ట సవరణ చేస్తే ముస్లింలకు తీవ్ర నష్టం జరుగుతుంది. వక్ఫ్‌బోర్డు అధికారాలను తగ్గించడంతో పాటు ముస్లింలు కాని వారిని, మహిళలను బోర్డులోకి తీసుకోవడం ఏ మాత్రం సమంజసం కాదు. ఈ సవరణ వల్ల ముస్లిం సమాజానికే తీవ్ర నష్టం జరుగుతుంది. అవినీతిని తగ్గించి జవాబుదారితనం పెంచాలనే లక్ష్యంతో ఈ ప్రతిపాదన చేస్తున్నట్లు చెబుతున్నప్పటికి వక్ఫ్ బోర్డుల అధికారాలను కుదించడం కోసమే ఈ సవరణ చేస్తున్నారు. ఈ విషయంలో కేంద్రం పునరాలోచించుకోవాలి.

–జాఫర్ ఇందిరమ్మ కాలనీ, కమలాపురం.

క్లుప్తంగా

రేపు వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె జబ్బులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అలాగే ఆదివారం ఉదయం 6 గంటల నుంచి ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహించి ప్రముఖ షుగర్ స్పెషలిస్టు డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి సలహాలు, సూచనలు ఇవ్వడం జరుగుతుందన్నారు. షుగర్ పరీక్ష చేయించుకోవాలనుకునే వారు ఉదయం ఏమి తినకుండా రావాలన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

బియ్యం పంపిణీ తనిఖీ

వేముల : మండలంలోని చాగలేరులో జరుగుతున్న బియ్యం పంపిణీని శుక్రవారం తహసీల్దార్ ఇందిరారాణి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె బియ్యం పంపిణీపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. బియ్యం పంపిణీలో ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా.. సక్రమంగా తూకం వేస్తున్నారా తదితర విషయాలపై లబ్ధిదారులతో మాట్లాడారు. బియ్యం బండిలో లబ్ధిదారుని ఇంటి వద్దకే వెళ్లి బియ్యం పంపిణీ పరిశీలించి సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో ఆర్ఐ రేఖ, వీఆర్వో సునీల్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

వేంపల్లె : స్థానిక కందుల ఓబుల్‌రెడ్డి చారిటీస్ ఐటీఐలో 2024–25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ ప్రసాద్‌రావు తెలిపారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 10వ తరగతి పాసై, ఫెయిల్ అయిన విద్యార్థులు వివిధ కోర్సులలో చేరడానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. మూడవ విడతలో మిగులు సీట్ల కొరకు వేంపల్లె ఐటీఐలో ఫిట్టర్, సివిల్, డీజిల్ మెకానిక్, వెల్డర్, ప్లంబర్ కోర్సులు ఉన్నాయని ఆగస్టు 24వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఘనంగా నాగుల పంచమి



పుట్టకు పాలు పోస్తున్న మహిళలు

పులివెందుల టౌన్ : పట్టణంలో నాగులచవితి పండుగను పురస్కరించుకుని రెండవరోజు నాగపంచమి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. శుక్రవారం పుట్టకు పాలు పోసి ఉపవాస దీక్షను విరమించారు. పట్టణంలోని మిట్టమల్లేశ్వరస్వామి ఆలయంలోని నాగులకట్ట వద్ద, పీడబ్ల్యూ కాలనీ, సాయిబాబా ఆలయం, నాగులకట్ట, తదితర ప్రాంతాల్లో ఉన్న పుట్టల వద్ద భక్తులు పుట్టలలో పాలు పోసి తమ భక్తిని చాటుకున్నారు.

15న ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు

వేంపల్లె : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న విద్యార్థులకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దివిజసంపతి తెలిపారు. మండలంలోని ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులు వివిధ స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలతో ప్రసంగించాలన్నారు. 1 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు ఈనెల 12లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ కోసం 8977471317 నెంబరును సంప్రదించాలన్నారు. స్థానిక ఎంపీడీఓ సభాభవనంలో ఆగస్టు 15న ఉదయం 11 గంటలకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు ప్రారంభమవుతాయన్నారు.

ఇష్టపడి చదివితే మంచి భవిష్యత్తు

చక్రాయపేట : కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని లక్కిరెడ్డిపల్లె జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌కే ఫైజున్నీసా తెలిపారు. శుక్రవారం చక్రాయపేటలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి పాఠశాల ఆవరణను పరిశీలించారు. అనంతరం ప్రిన్సిపాల్ గౌస్‌ప్యారీ, సిబ్బందితో అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె విద్యార్థినులతో మాట్లాడుతూ పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు.

చేనేత రంగం ప్రాముఖ్యమైనది

పులివెందుల టౌన్ : దేశ సంస్కృతికి చేనేత రంగం ప్రాముఖ్యమైనదని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 1, 2 ఆధ్వర్యంలో చేనేత వస్త్రాల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆప్కో మేనేజర్ రవిశంకర్ మాట్లాడుతూ చేనేత వస్త్రాల వాడకంపై అవగాహన కల్పించి వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుధీర్, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ అధికారి శ్రీనిత, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపిక

పెద్దముడియం : పెద్దపసుపుల గ్రామంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థునులు పి.భావన, పి.మౌనిక రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ఎస్ఓ మౌనిక,వ్యాయామ ఉపాధ్యాయురాలు గంగా శిరీష తెలిపారు.ఈ నెల 4న అన్నమయ్య జిల్లాలో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో మంచి ప్రతిభ కనబరిచి గుంటూరు, శ్రీకాకుళం జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు.

పంటనమోదులో అవకతవకలకు తావివ్వద్దు

వీరపునాయునిపల్లె : రైతులు సాగు చేసిన పంట నమోదు కార్యక్రమంలో ఎటువంటి అవకతవకలకు తావివ్వద్దని కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి తెలిపారు. మండంలోని మొయిళ్లచెరువు గ్రామంలో చేపడుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబుతో కలసి ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. మండలస్థాయి నుంచి రాష్ట్రస్థాయి అధికారుల వరకు తనిఖీలు చేయడం జరుగుతుందని ఎటువంటి వ్యత్యాసాలు లేకుండా ఖచ్చితంగా నమోదు చేయాలన్నారు. మండల వ్యాపితంగా 2482 హెక్టార్లలో వ్యవసాయం మరియు 3325 హెక్టార్లలో ఉద్యాన వన పంటలు సాగుచేయడం జరిగిందని ప్రతి పంటను నమోదు చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అలాగే ప్రస్తుతం



పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి

సాగులో ఉన్న పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని అలా చేయడం వలన అధిక దిగుబడి సాధించవచ్చని ఏడీఏ నరసింహారెడ్డి రైతులకు వివరించారు. కార్యక్రమంలో రైతు సేవాకేంద్రం సిబ్బంది లక్ష్మిసిందుర, రైతులు పాల్గొన్నారు.

కంటి సమస్యలు లేనప్పుడే చదువులో బాగా రాణిస్తారు

పులివెందుల టౌన్ : విద్యార్థులు కంటి సమస్యలు లేనప్పుడే చదువులో బాగా రాణిస్తారని ఎంఈఓ చంద్రశేఖర్‌రావు తెలిపారు. స్థానిక రమణప్ప సత్రం ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత ఉన్నత పాఠశాల(అంకాలమ్మపేట), ప్రభుత్వ ఉన్నత పాఠశాల (మెయిన్)లలో అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో కంటిచూపుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంఘం నేత్రాధికారులు సుధాకర్‌రెడ్డి, రిమ్స్ నేత్రాధికారి విజయ్‌కుమార్‌లు మాట్లాడుతూ విద్యార్థులు నిత్యం పౌష్టికాహారం తీసుకోవడం వల్ల దృష్టి లోపాన్ని అధిగమించవచ్చన్నారు. పరీక్షలలో దృష్టి లోపం ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రభుత్వం ఉచితంగా కంటి అద్దాలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయ బృందం, స్నేహిత అమృతహస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు, ఏఎన్‌ఎం సుందరమ్మ, చంద్రకళ, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వాసవి మాతకు ప్రత్యేక అలంకరణ

వేంపల్లె : స్థానిక కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో వాసవిమాతకు పసుపు కుంకుమ చీరతో ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణ చేశారు. శ్రావణమాసం ప్రథమ శుక్రవారం సందర్భంగా అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్‌శర్మ వాసవి మాతకు పంచామృతాభిషేకం, మహామంగళ హారతి తదితర విశేష పూజలు నిర్వహించారు. మహిళా మండలి అధ్యక్షురాలు ప్రవీణా మాట్లాడుతూ మహిళలతో లలితా సహస్రనామం, కుంకుమపూజ, మణిద్వీప, వర్ణన జాజిపూలతో ఆలయంలో పూజలు నిర్వహించినట్లు తెలిపారు.



వాసవి మాతకు పసుపు కుంకుమ చీరతో ఆర్యవైశ్య మహిళా మండలి

అలాగే తీర్థప్రసాదాలను అందజేశామన్నారు.

ఉద్యానపంటలకు రాయితీతో మల్చింగ్

ముద్దనూరు : ఉద్యాన పంటలలో మల్చింగ్‌తో సాగుచేసే వారికి రాయితీ అందిస్తున్నట్లు ఉద్యాన శాఖాధికారి మల్లేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన గంగాదేవిపల్లెలో మల్చింగ్‌తో సాగుచేసిన ఉద్యాన పంటలను పరిశీలించి మాట్లాడారు. దోస, కర్బూజ, కలింగర, బీర, కాకర తదితర పంటలలో మల్చింగ్ వేసుకుంటే 1 హెక్టార్‌కు రైతులకు రూ.16వేలు చొప్పున గరిష్ఠంగా 2 హెక్టార్‌లకు రూ.32 వేలు అందిస్తున్నట్లు తెలిపారు. వీటితో పాటు టమోటా, బీర, కాకర పంటలకు ఊతకర్రలు ఏర్పాటుచేసుకుంటే 1 హెక్టారుకు రూ.20 వేలు



మల్చింగ్‌తో సాగుచేసిన పంటను పరిశీలిస్తున్న హెచ్‌వో

చొప్పున ఉద్యాన శాఖ రాయితీ అందిస్తుందని, రైతులు దీనికి సద్వినియోగం చేసుకోవాలని హార్టికల్చర్ అధికారి తెలిపారు.

ఎస్ఐలుగా బాధ్యతల స్వీకరణ

పెండ్లిమర్రి : మండల ఎస్ఐగా మధుసూదన్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కడప వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ పెండ్లిమర్రి పోలీసుస్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలు, శాంతి భద్రతలపై దృష్టి సారించి ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. ప్రజల సమస్యలు ఏమైనా ఉంటే స్టేషన్‌కు వచ్చి నిర్భయంగా ఫిర్యాద్ చేయవచ్చన్నారు.

వీయన్‌పల్లె ఎస్ఐగా మంజునాథ్

వీరపునాయునిపల్లె : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం నూతన ఎస్ఐగా మంజునాథ్ బాధ్యతలు చేపట్టారు. ఈయన ప్రొద్దుటూరు వన్ టౌన్ పోలీస్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ బదిలీపై వచ్చారు. పోలీసులు, ప్రజలు స్నేహ భావంతో కలసిమెలసి ఉండాలన్నారు. ఇక్కడ పనిచేస్తున్న వెంకటరెడ్డి సెలవుపై వెళ్లాడు.

కొండాపురం ఎస్ఐగా విద్యాసాగర్..

కొండాపురం : స్థానిక ఎస్ఐగా విద్యాసాగర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. బ్రాహ్మంగారిమఠం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చినట్లు ఆయన తెలిపారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ యోగీంద్ర ప్రొద్దుటూరు త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీయ్యారు.

పెద్దముడియం ఎస్ఐగా సుబ్బారావు

పెద్దముడియం : పెద్దముడియం ఎస్ఐగా జమ్మలమడుగు ఎస్ఐగా పని చేస్తున్న సుబ్బారావును ఉన్నతాధికారులు నియమించారు.ఇక్కడ పనిచేస్తున్న రామక్రిష్ణను జమ్మలమడుగు ఎస్ఐగా బదిలీ చేశారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

సింహాద్రిపురం : మండలకేంద్రమైన సింహాద్రిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2023–24 సంవత్సరం 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మొదటి, రెండవ, మూడవ ర్యాంక్ సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. రూ.7116లు, రూ.5వేలు, రూ.3వేలు చొప్పున ఎస్ఎస్ఎల్ సి 1967–68 బ్యాచ్ సత్యప్రసాద్‌రెడ్డి ఆయన తల్లి పొన్నతోట గంగమ్మ జ్ఞాపకార్థం వరుసగా మొదటి, రెండవ, మూడవ ర్యాంకులు సాధించిన రాధికా, కాలిఫా, లోకేశ్వరిలకు ఆయన ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయురాలు ఉమా



బహుమతులు అందుకున్న విద్యార్థులతో సత్యప్రసాద్‌రెడ్డి

అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సత్యప్రసాద్‌రెడ్డిని వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో గంగాధరరెడ్డి, అరవిందనాథరెడ్డి, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా అంకాలమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద రంగాపురం గ్రామంలో అంకాలమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి వెల్లాల సీతారామశర్మ ఆధ్వర్యంలో ప్రతిష్ట మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గోదర్శనం, ప్రతిష్ట హోమాలు పూర్ణాహుతి, కలశ ఉద్వాసన ఇత్యాధి పూజాకార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే ఎద్దుల పోటీలను వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ మధురెడ్డిలు ప్రారంభించారు. మొదటి రెండు బహుమతులను చౌటిపల్లికి చెందిన చంద్రఓబుల్‌రెడ్డికి చెందిన ఎద్దులు 2070, 2037 అడుగులు లాగి మొదటి, ద్వితీయ బహుమతులను సాధించారు. తృతీయ బహుమతిని గుంప్రమాన్‌దిన్నెకి చెందిన రాంభూపాల్‌రెడ్డి ఎద్దులు దక్కించుకున్నాయి. బాపట్ల వేటపాలెంకు చెందిన ఆర్‌కె బుల్స్ నాల్గవ బహుమతిని, రామతీర్థంకు చెందిన నాగరాజు ఐదవ బహుమతిని, కెరామాంజనేయులు ఎద్దుల ఆరవ



అంకాలమ్మ తల్లి అమ్మవారు



వెండి ప్రతిమను అందజేస్తున్న దేవస్థాన కమిటీ సభ్యులు

బహుమతిని, తోపదుర్తికి చెందిన చెన్నప్ప ఎద్దులు ఏడవ బహుమతిని, మేదిమక్కపల్లి, పీఆర్‌పల్లి చెందిన పవన్‌కుమార్‌రెడ్డి, శ్రీరామ్ యాదవ్‌లకు చెందిన జంట ఎద్దులు ఎనిమిదవ బహుమతిని, మూలి రామాంజనేయులుకు చెందిన ఎద్దులు 9వ బహుమతిని గెలుపొందారు. విజేతలకు దేవస్థానం నందు బహుమతులను అందజేశారు. అదేవిధంగా దేవస్థానం తరపున రూ.15 వేలు విలువ చేసే అమ్మవారి వెండి ప్రతిమను మొదటి బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, కౌన్సిలర్ కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిపై శిక్షణ

సింహాద్రిపురం : కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పంచాయతీరాజ్ గ్రామాభివృద్ధిపై ఎన్నికైన సర్పంచులు, ఆ గ్రామ కార్యదర్శులకు మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీఓ సాల్మన్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ తరగతులు 12వ తేదీ నుంచి 14వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మండల పరిషత్ సభాభవనంలో ఉంటాయన్నారు. ఈ శిక్షణ తరగతులకు అందరూ తప్పక హాజరు కావాలన్నారు.

జోరుగా మట్టి అక్రమ రవాణా



నందిమండలంవద్ద అక్రమంగా ఇటుకల బట్టీలకు మట్టి తరలిస్తున్న ట్రాక్టర్

పెండ్లిమర్రి : మండలంలోని నందిమండలం–తవ్వపల్లె గ్రామాల మధ్యలో ఉన్న కుంటలో నుంచి మట్టి అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. అధికార పార్టీ నేతల అండతో కొందరు టీడీపీ నాయకులు మట్టిని ట్రాక్టర్లతో ఇటుకల బట్టీలకు తోలి సొమ్ము చేసుకుంటున్నారు. శుక్రవారం కుంటలో జేసీబీ యంత్రంతో దాదాపు 10 ట్రాక్టర్లతో అక్రమంగా మట్టిని తరలిస్తుండగా గ్రామస్తులు వెళ్లి అనుమతులు ఉన్నాయా అని అడగ్గా అక్రమార్కులు వారికి స్పందించలేదు. దీంతో గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో వీఆర్వో రామచంద్రారెడ్డి సంఘటనా స్థలానికి వెళ్లే సరికి అక్రమార్కులు పారిపోయారు.

రక్తదానంపై అపోహలు వద్దు

పులివెందుల రూరల్ : రక్తదానంపై ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దని రక్తనిధి మెడికల్ ఆఫీసర్ రేవతి తెలిపారు. లోకల్ రౌడీ సినిమా హీరో మహేష్ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం కడప రోడ్డులో ఉన్న వైఎస్సార్ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో 25 మంది రక్తదాతలు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సేవా సమితి అధ్యక్షుడు రాజు, రక్తనిధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పులివెందుల రూరల్ : పట్టణంలోని రాజీవ్‌నగర్ 11 కేవీ ఫీడర్ కింద చెట్లు కొట్టే కార్యక్రమం ఉన్నందు వల్ల శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్‌శాఖ జేఈ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో రాజీవ్‌నగర్ కాలనీ, న్యాక్ బిల్డింగ్, నలంద స్కూల్, సాయిబాబాగుడి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

వైభవంగా నూతన విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు

పెండ్లిమర్రి : మండలంలోని కాంట్లోపల్లె గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ సీతారామ సమేత కోదండరామస్వామి నూతన విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు శుక్రవారం ఆలయ కార్యానిర్వాహకుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి నూతన విగ్రహ ప్రతిష్టకు హాజరై స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉస్సేన్ పాల్గొన్నారు.

యువత మత్తుపదార్థాల జోలికి వెళ్లొవద్దు

జమ్మలమడుగు : యువత మత్తుపదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని డీఎస్పీ జి.హుస్సేన్ పీరా తెలిపారు. శుక్రవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించుకుందాం అనే కరపత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు. యువత చెడు వ్యసనాలకు బానిసలైతే తమ కుటుంబాల మొక్క గౌరవాన్ని వీధిన పడేసిన వారవుతారన్నారు. చదువుతోనే యువత భవిష్యత్తు బంగారం అవుతుందన్నారు. క్రికెట్ బెట్టింగ్, గంజాయి లాంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు శివనారాయణ, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.



జమ్మలమడుగులో కరపత్రాలను విడుదల చేస్తున్న డీఎస్పీ హుసేన్ పీరా

దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలి

దళితులపైన జరుగుతున్న దాడులను అరికట్టాలని ఎస్సీ, ఎస్టీ జిల్లా అధ్యక్షురాలు కోఆర్డినేటర్ లక్ష్మీ శుక్రవారం డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీకి వినతి పత్రం అందజేశారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి

పులివెందుల టౌన్ : విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, తద్వారా తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని డాక్టర్ నివేధిత తెలిపారు. శుక్రవారం స్థానిక ఫుడ్ అండ్ సైన్స్ కళాశాలలో ఆమె విద్యార్థులకు మాదకద్రవ్యాలపై నషాముక్తా అభియాన్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కా



పులివెందులలో విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న డాక్టర్ నివేధిత

ర్యక్రమం నిర్వహించి మాట్లాడారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉన్నప్పుడే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి, అసోసియేట్ డీన్ అరుణ, జాతీయ సేవాపథకం అధికారులు జయమ్మ, నివేధిత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహంపై దాడి అమానుషం



అంబేడ్కర్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, న్యాయవాదులు



జమ్మలమడుగులో నిరసన వ్యక్తం చేస్తున్న దళిత నాయకులు

కమలాపురం : విజయవాడలోని అంబేడ్కర్ విగ్రహంపై అల్లరి మూకలు దాడి చేయడం అమానుషం అని కమలాపురం బార్ అసోసియేష్ అధ్యక్షుడు పుష్పరాజు తెలిపారు. శుక్రవారం వారి కార్యాలయంలో బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటానికి నివాళులర్పించి మాట్లాడారు. అంబేడ్కర్ విగ్రహంపై జరిగిన దాడి అమానుషం అని ఈ దాడిని ఖండిస్తున్నామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అడ్వకేట్స్ గురవయ్య, ప్రశాంత్ కొండారెడ్డి, ఉదయ్ కిరణ్, రాజేశ్వర్‌రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : విజయవాడలో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని పాతబస్టాండ్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద వారు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. రాజ్యాంగ నిర్మాతపై దాడికి పాల్పటడం రాజ్యాంగంపైనే దాడి చేసినట్లే అన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకుడు మార్బల్ శ్రీను, సింగరయ్య, కిరణ్‌కుమార్, ఏబు, విజయ్ తదితరులు పాల్గొన్నారు

లింగాల ఎంపీడీఓ బదిలీ

లింగాల : స్థానిక ఎంపీడీఓగా పనిచేస్తున్న తేజోత్స్న అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు. ఎంపీడీఓ, పంచాయతీరాజ్ శాఖ, ఉపాధి హామీ సిబ్బంది ఆమెను ఘనంగా సన్మానించి ఆమె సేవలను కొనియాడారు. ఎంపీడీఓ తేజోత్స్న మాట్లాడుతూ విధి నిర్వహణలో భాగంగానే కిందిస్థాయి సిబ్బందితో అలా వ్యవహరించాల్సి వచ్చిందన్నారు. మహిళా సిబ్బంది ఆమెకు చీర సారలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ భర్త మల్లికార్జునరెడ్డి, ఏఓ లోకేశ్వరరావు, ఈఓపీఆర్డీ ఓరెన్స్‌పేబి, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు

పులివెందుల రూరల్ : నల్లపురెడ్డిపల్లెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యాజమాన్య కమిటీ ఎన్నికలు శుక్రవారం ప్రశాంతంగా ముగిశాయి. గురువారం జరుగాల్సిన ఎన్నికలు ఫోరం లేకపోవడంతో శుక్రవారానికి వాయిదా వేసినట్లు ఎంఈఓలు చంద్రశేఖర్‌రావు, రామానాయుడులు తెలిపారు. హెచ్‌ఎం కమల్నాథశర్మ, పోలీసుల ఆధ్వర్యంలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. కమిటీ చైర్మన్‌గా నాగమల్లేశ్ యాదవ్, వైస్ చైర్మన్‌గా యశోదలను ఎన్నుకున్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

వల్లూరు (చెన్నూరు) : మండల వ్యాప్తంగా శనివారం ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ చెన్నూరు మండల ఏఈ రామలింగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.